క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు చేస్తోన్న త్రీటౌన్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని త్రీటౌన్ పరిధిలో వాహనదారులు సరైన ధృవపత్రాలను కలిగి ఉండాలనీ, రోడ్లపై ఇష్టారాజ్యంగా తిరిగితే సహించేదిలేదని ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్ తెలిపారు. ఏలూరు నగరంలో ఫైర్‌స్టేషన్ సెంటర్, ఇతర ప్రాంతాల్లో సరైన దృవపత్రాలు లేని వాహనదారులకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరంలో వాహనదారులు రోడ్లపైకి వస్తే సరైన పత్రాలు కలిగి ఉండాలనీ, రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో హెల్మెట్ ధరించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. యువత ముఖ్యంగా మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారనీ, వారి తల్లి దండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి



వ్యవసాయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ గద్దె రమేష్

దెందులూరు: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని దెందులూరు మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ అన్నారు. శుక్రవారం దెందులూరు రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సలహామండలి దెందులూరు మండల చైర్మన్ కొండేటి గంగాధరబాబు అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. సమావేశంలో చైర్మన్ గంగాధరబాబు మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధి, రైతుభరోసా కేంద్రాల ఏర్పాటు, ఎరువులు, పురుగుమందుల కొరత లేకుండా పంపిణీతో పాటు అనేక సంక్షేమ పథకాలు రైతుల కోసం అమలు చేస్తున్నారన్నారు. అధిక దిగుబడుల లక్ష్యంగా రైతులు సాగు విషయంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వ్యవసాయ కళాశాల విద్యార్థులు (రాజమండ్రి) పాల్గొన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలపై హర్షం

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్న కానుకగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఆసరాగా వారి పిల్లల పెళ్ళిళ్లకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల్లో ఆర్థిక సాయం విడుదల చేయడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా స్థానిక వన్‌టౌన్ నందలి సంఘ కార్యాలయం నందు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీల తరుపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమ కూతురికి పెళ్లి చేయాలంటే ఎంతో కష్టంతో కూడుకున్నదిగా మారిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్న కుటుంబంలో కొడుకుగా, అన్నగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను తీసుకు వచ్చి పెళ్ళి కానుక అందించడం గొప్ప విషయమన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసిన ఈ పథకాల్లో భాగంగా ఏలూరు నగరంలోని 18 మందికి పెళ్లయిన కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు బీసీల తరుపున ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అప్పిరెడ్డి రంగ ముత్యాలు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, ఎదలాడ నాని, బాయి వెంకట్రావు, కొండల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ నాయకులు

ఫేస్‌బుక్‌లో మహిళకు వేధింపులు

ఏలూరు టౌన్: ఒక యువకుడు ఫేస్‌బుక్‌లో మహిళలను పరిచయం చేసుకుని, తొలుత మంచిగా స్నేహాన్ని పెంచుకుని అనంతరం లైంగికంగా వేధింపులకు గురిచేస్తూ, బ్లాక్ మెయిల్ చేస్తోన్న వ్యక్తిని ఏలూరు టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏలూరు టూటౌన్ సీఐ పీ. చంద్రశేఖర్ తెలిపిన వివరాలు మేరకు... తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లా ఆలేరు ప్రాంతానికి చెందిన లక్కోజు నాగరాజు అనే వ్యక్తి ఏలూరు నగరానికి చెందిన ఒక వివాహిత మహిళకు ఫేస్‌బుక్‌లో పరిచయం అయ్యాడు. అనంతరం అతను ఆమెను వేధిస్తూ అసభ్యకరమైన మెస్సేజ్‌లు చేయటం, బ్లాక్‌మెయిల్ చేస్తూ తన అక్కౌంట్‌లో డబ్బులు వేయాలని వేధిస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం ఏలూరులోని పెద రైల్వేస్టేషన్ వద్ద నిందితుడు నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. అతడ్ని విచారణ చేయగా గతంలోనూ ఇదే తరహాలో ముగ్గురు యువతులను మోసం చేశాననీ, ఫేస్‌బుక్‌లో మహిళలను పరిచయం చేసుకుంటూ ఇలా వేధిస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. నిందితుడ్ని న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.



వేధింపులకు గురిచేస్తోన్న వ్యక్తిని అరెస్టు చేసిన టూటౌన్ సీఐ చంద్రశేఖర్

13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల దిగ్బంధం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణ సాధనకై బిజెపి నమ్మక ద్రోహాన్ని నిరసిస్తూ ఈ నెల 13న జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలివెల చంటి ఒక ప్రకటనలో కోరారు. షెడ్యూల్డ్ కులాల ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సాధనకై జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీసుకున్న నిర్ణయం మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్గీకరణ సాధనకై అలుపెరుగని పోరాటం చేస్తున్న మాదిగల పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. గత 28 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ చేయాలని అలుపెరుగని పోరాటం చేస్తున్న పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 13న నిర్వహించే జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

13న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని వివిధ ఆర్టీసీ బస్టాండుల్లో వ్యాపారాభివృద్ధి చేసుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 13వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా ఏలూరు కొత్త బస్టాండు, ఏలూరు పాత బస్టాండు, భీమవరం, పాలకొల్లు బస్టాండుల్లో వాణిజ్య సముదాయం పెంపొందించే మార్గంలో అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడానికి ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరులోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ అవగాన సదస్సు ప్రారంభమౌతుందన్నారు.

కుష్టు రోగులకు అండగా లెప్రా సొసైటీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని కుష్టు రోగులకు తమ సంస్థ అండగా ఉంటోందని లెప్రా సొసైటీ స్టేట్ కో- ఆర్డినేటర్ ఎం. రాధిక అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలనా పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం ఏలూరు మండలంలోని చాటపర్రు సీహెచ్‌సీ పరిధిలో పుష్ప లెప్రసీ కాలనీలో రోగులకు పాదరక్షలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాధిక మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కుష్టురోగులకు పాదరక్షలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. లెప్రా సొసైటీ ప్రాజెక్టు అసోసియేట్ వహీద్ బాషా మాట్లాడుతూ రోటరీ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగభూషణరావు సహకారంతో వీటిని అందించినట్లు చెప్పారు. సంస్థ పీటీ పీకే కొసల మాట్లాడుతూ కాళ్లలో స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే అప్రమత్తం కావాలన్నారు. అటువంటి వారు లెప్రా సొసైటీ వారు అందించే పాదరక్షలు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో సత్యనారాయణ, అవుట్ రీచ్ వర్కర్ రాణి, టెక్నీషియన్ అప్పలరాజు, చాటపర్రు వైద్య సిబ్బంది పాల్గొన్నార



పాదరక్షలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభూషణరావు, చిత్రంలో ప్రాజెక్టు అసోసియేట్ వహీద్ బాషా

దంత వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : దంతవ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని స్టార్ డెంటల్ క్లినిక్ వైద్యుడు ఎస్. శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం స్థానిక ఏలూరు కొత్త బస్టాండులో ఆర్టీసీ కార్మికులకు స్టార్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ చిన్న సమస్యేనని వేచి చూసే ధోరణిలో ఉంటే సమస్య పెద్దగా మారి శస్త్ర చికిత్స అవసరమయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. ఎటువంటి చిన్న సమస్య అయినా వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా తొలి దశలోనే నివారించే అవకాశం ఉంటుందన్నారు. ఆర్టీసీ కార్మికులు నిత్యం ఎంతో బిజీగా ఉంటారని, కనీసం వైద్యులను సంప్రదించే వెసులుబాటు కూడా ఉండని వారి కోసం ఈ దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఉండే ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్య సేవలు తమ స్టార్ డెంటల్ క్లినిక్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రజా రవాణా శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రతి కార్మికుడూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 200 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, పేస్టులు, మౌత్ లోషన్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ డెంటల్ క్లినిక్ వైద్యురాలు డాక్టర్ ఎస్. సింధుజ, ఆర్టీసీ ఏలూరు డీపో మేనేజర్ బీ. వాణి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికులకు దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీహర్ష

ట్రాక్ దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ఏలూరు (టూటౌన్) : రైల్వే ట్రాక్ దాటే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని డీసీఐ రైల్వే జోనల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు కోరారు. పవరుపేటలోని గిలకల గేటు సెంటర్ వద్ద రైల్వే మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు రైల్వేపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జనపరెడ్డి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే ప్రమాదాల గురించి వివరించారు. డీఆర్‌యుసీసీ సభ్యులు నాగం శివ మాట్లాడుతూ 170 సంవత్సరాల నుంచి రైల్వే వ్యవస్థ దేశంలో ఉందన్నారు. ఈ రోజు దేశ వ్యాప్తంగా 25వేల రైళ్లు, 125 వేల రైల్వే లైన్లు ఉన్నాయన్నారు. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వందే భారత్ రైలుకు ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితమివ్వడం ప్రతి పౌరునికి గర్వకారణమన్నారు. రైల్వే సీఐ శంకరరరావు మాట్లాడుతూ రైల్వేలు, రైల్వే పోలీసు విధులు, బాధ్యతలు గురించి తెలియజేసారు. ఎవ్వరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠినంగా శిక్షిస్తారన్నారు. స్థానిక కార్పొరేటర్ జనపరెడ్డి కృష్ణ మాట్లాడుతూ గిలకలగేటు ప్రాంతంలో ఫుట్‌బాత్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.నాగేశ్వరరావు, వెల్లంకి రాజు, ఆటో యూనియన్ నాయకులు చిరంజీవి,పి.గోవింద్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



రైల్వేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీఐ రైల్వే జోనల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు



వివిధ సంఘాల జిల్లా సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి తెలిపారు. స్థానిక నరసింహారావు పేటలో సీఐటియూ జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజా సంపదంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారని తెలిపారు. ప్రజలపై ఎక్కువ పన్నులు మోపడంతో మధ్య తరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాలకు కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటియూ జిల్లాప్రధాన కార్యదర్శి డిఎస్‌విడి ప్రసాద్, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్,గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్న,వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ,కౌలురైతుల సంఘం జిల్లా కో-కన్వీనర్ వి.శ్రీరామచంద్రమూర్తి, సిటియు జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి, వివిధ సంఘాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	28-07
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	12-15
బెండకాయలు	54	కంద	40
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	30
కాకర కాయలు	30-36	కీరా దోస	30
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	52	అల్లం	68
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	32	పాలకూర	08
దొండకాయలు	26	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	22	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	28-34	బఠాణీ	--
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	20

అదానీ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్) : అదానీ కంపెనీకి సంబంధించిన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం తక్షణం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ అదానీ ఆర్థిక అవకతవకలకు వ్యతిరేకంగా సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రధానకార్యాలయం వద్ద సీపీఐ ఏలూరు సమితి ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షతన నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మోదీ డౌన్ డౌన్, అదానీ అప్పు దేశానికి ముప్పు, బిజెపి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే విధంగా వ్యవహరిస్తుందన్నారు. ఆదానీ ఆర్థిక అవకతవకలపై వెంటనే జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, సన్నేపల్లి సాయిబాబా, కడుపు కన్నయ్య, కురెళ్ల వరప్రసాద్, తెర్లాపు శ్రీను, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, కొంపల్లి కృష్ణమాచార్యులు, పాటేలు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

జంగారెడ్డిగూడెం: ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం ఇవ్వలేని గౌరవం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇస్తోందని జంగారెడ్డిగూడెం పట్టణ, మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి దేవాదాయ శాఖ పరిధిలో 610 దేవాలయాల్లో ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నాయీ బ్రాహ్మణులు నియమించాలని జీవో ఇవ్వడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు మలవరపు నాగపాసి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

నేటి నుంచి జాగృతి ఉద్యమం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రముఖ, సామాజిక ఆధ్యాత్మిక సంస్థ అయిన జమా అతె ఇస్లామి హింద్ (జెఐహెచ్) ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేది నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ।మానవత నైతికత॥ అనే నినాదంతో జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఏలూరు నగర అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నాడని, కానీ మానవతా విలువలు నానాటికి దిగజారుతున్నాయని, సమాజం నిత్యం అశాంతికి, అలజడికి గురవుతోందని, ఇందుకు నేడు సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలే ప్రత్యక్ష ఉదాహరణలన్నారు. ఈ నేపథ్యంలో మనిషిలో నైతిక పరివర్తన కలిగినపుడే మానవతా విలువలు వికసిస్తాయని, దైవభీతి, జవాబుదారీతనం వల్లనే మనిషిలో అవసరమైన మానవీయత, నైతికత జనిస్తాయని అన్నారు. సమాజంలో ఈ భావనను పెంపొందించే ఉన్నత లక్ష్యంతోనే జమా అతె ఇస్లామి హింద్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ।మానవత - నైతికత॥ జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమంలో భాగంగా సామాజిక, రాజకీయ వివిధ ప్రత్యేక రంగాలకు సంబంధించిన ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, వివిధ మతాల ఆధ్యాత్మిక గురువులతో చర్చాగోష్టిలు, వ్యక్తిగత పరిచయాలు, కరపత్రాలు పోస్టర్ల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆకతాయిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

కొయ్యలగూడెం: బాలిక వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్న ఆకతాయిపై చర్యలు తీసుకోవాలంటూ గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. శుక్రవారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ ఎదురుగా 100 మందికి పైగా గ్రామస్తులు తమ నిరసన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మండలం కృష్ణంపాలెంకు చెందిన ఎంటీ విష్ణు కొద్ది కాలంగా చొప్పరామన్నగూడెంకు చెందిన హైస్కూల్ విద్యార్థిని వెంట పడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. బాలిక తన కుటుంబీకులకు విషయం తెలపగా ఆమె సోదరుడు ఆకతాయిని గవరవరం జెడ్పీ హైస్కూల్ వద్ద నిలదీశాడు. ఆ సమయంలో విష్ణు అతని అనుచరులు బాలిక సోదరుడు, తండ్రిపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ నేపథ్యంలో యువకుడితోపాటు అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

చురుగ్గా మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు



పట్టిసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వి.సుమతి

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ఆమె పట్టిసంలో ఉత్సవ పనులను శుక్రవారం పరిశీలించారు. భక్తులు కాలినడకన పంట్లు ఎక్కే మార్గంలో ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. మూడు పంట్లు వచ్చాయని, వాటితో ఫ్లాట్‌ఫారం, జెట్టీలు కడుతున్నారని తెలిపారు. ఇసుక తిన్నెలపై నీడకు షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మంచినీటి వసతి కోసం ఇసుక తిన్నెలపై చేతి పంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శివక్షేత్రం వద్ద ఫ్లాట్‌ఫారం పనులు వేగవంతం చేసినట్టు తెలిపారు.

వింజరం పీహెచ్‌సీ పరిశీలన

పోలవరం మండలం వింజరం గ్రామ పీహెచ్‌సీని తహసీల్దార్ బి.సుమతి సందర్శించి రికార్డులను పరిశీలించారు. అన్ని రకాల మందులు ఉన్నాయా లేదా అనే విషయాలను వైద్యాధికారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.